ADMISSIONS ARE IN PROGRESS 2024-25
Secretary & Correspondent
Bikki Venkateshwarlu
M.Sc (Physicis), M.Ed.
Join your kids with us & Empower their Academic Excellence with Ethical Foundations
INDIRA VIDYALAYA
Nursery to VII class, English Medium
Near Bodrai, Mahabubabad.
Cell: 9701912300, 9705412300

దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 87 శుక్రవారం 28-03-2025 ఎడిటర్ : వేముల అయోధ్య రాములు పేజీలు : 4 వెల : 5 రూ/..

## వందశాతం రుణమాఫీ
# నిరూపిస్తారా?

**మహిళలకు తులం బంగారం హామీ ఏమయ్యింది**
**దొడ్డువడ్లకు 500 బోనస్ ఎక్కడ పోయింది**
**బిఆర్ఎస్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి పెట్టింది**
**ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చలో కెటిఆర్**



**తొలి సమయం, హైదరాబాద్,మార్చి27:** కొండారెడ్డి పల్లి పోదామా.. కొడంగల్ పోదామా..? రాష్ట్రంలో ఏ గ్రామంలోనైనా వందశాతం రుణమాఫీ అయ్యిందని నిరుపిస్తారా..? అంటూ అసెంబ్లీలో ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా కేటీ–ఆర్ మాట్లాడారు. ఒకవేళ రుణమాఫీ 100 శాతం పూర్తి అయినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి పూర్తిగా తప్పుకుంటానని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ అసెంబ్లీలో సవాల్ విసిరారు. రైతు భరోసా కింద రైతులకు రూ.15 వేలు ఇస్తామని చెప్పలేదా..? మహిళలకు తులం బంగారం ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. దొడ్డు వడ్లకు కూడా క్వింటాకు రూ.500 వంద బోనస్ ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పారు.. కానీ ఎన్నికల తర్వాత మాట మార్చి కేవలం సన్న వడ్లకే ఇస్తామని కాంగ్రెస్ రైతులను మోసం చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో ఉప్పు – నిప్పులాగా కొట్లాడుకుంటాం.. కానీ చెన్నైలో సీఎం రేవంత్ రెడ్డిని గౌరవించానని, అది నా సంస్కారం అని కేటీఆర్ పేర్కొన్నారు. రేవంత్ రెడ్డికి ఒక్కటి చెప్పదలచుకున్నా.. మీరు నేను చెన్నై మీటింగ్‌కు వెళ్లాం. అక్కడ మీరు ఒక ప్రతిపాదన పెట్టారు. నేను మీ పార్టీ వ్యక్తిని కాదు.. ఇక్కడ ఉప్పు నిప్పులాగా కొట్లాడుకుంటాం.. కానీ నేను మిమ్మల్ని గౌరవించి.. మా సీఎం చెప్పిన మాట కరెక్ట్ అని 33 శాతం కాదు 36 శాతం ఇవ్వొచ్చని చెప్పాను. ఎందుకంటే నాకు ఆ సంస్కారం ఉంది. ఎందుకంటే నీవు మా ముఖ్యమంత్రివి కాబట్టి.. హద్దులు, సరిహద్దులు దాటిన తర్వాత నిన్ను కాపాడాలి.. నిన్ను గౌరవించాలి.. అది నా బాధ్యత అని కేటీఆర్ తెలిపారు.

## కక్ష సాధించే వాడినైతే..
# కుటుంబమంతా జైల్లోనే!



**ఇవాళ అసెంబ్లీలో కూర్చుని మాట్లాడేవారు కాదు**
**ఎంపీని 16 రోజులు ఒంటరిగా బంధించారు**
**జైల్లో రాత్రి నిద్ర పోకుండా లైట్లు వేసి వేధించారు**
**పదేళ్లలో బీఆర్ఎస్ రుణమాఫీ రూ.16,908 కోట్లే**
**పది నెలల్లో రూ.20,616 కోట్లు మాఫీ చేశాం**
**పదేళ్ల పాలనను మా పది నెలలతో పోల్చండి**
**అభినందించాల్సింది పోయి కడుపులో కత్తులా?**
**కేటీఆర్ గుంటూరు తెలివితేటలు ఇక్కడొద్దు**
**పల్లెటూళ్లో చదివి సీఎం అయ్యానని నాపై అక్కసు**
**ప్రాజెక్టులు కట్టింది మీ ఫామ్ హౌస్‌ల కోసమే**
**ఎక్కడెవరు కొన్నారో నిజ నిర్ధారణ కమిటీ వేద్దామా?**
**కేటీఆర్, హరీశ్ రావులకు పార్టీ కుర్చీపై ఆశ**
**నేపాల్ తరహాలో కేసీఆర్‌ను తప్పించే కుట్ర**
**బడ్జెట్‌పై చర్చలో సీఎం రేవంత్ తీవ్ర వ్యాఖ్యలు**

**హైదరాబాద్, మార్చి 27: తనది కక్ష సాధించే మనస్తత్వమే అయితే మొత్తం కేసీఆర్ కుటుంబం ప్రస్తుతం చర్లపల్లి జైల్లో ఉండేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గురువారం బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి కక్ష, పగ, ప్రతీకారాలకు పోతున్నారని బీఆర్ఎస్ నేత కేటీఆర్ చేసిన ఆరోపణలపై సీఎం తీవ్రంగా స్పందించారు. తాము నిజంగా కక్ష సాధింపునకు పాల్పడితే బీఆర్ఎస్ నాయకులు అసెంబ్లీలో కూర్చుని నోటికొచ్చినట్లు మాట్లాడేవారు కాదని వ్యాఖ్యానించారు. తనను ఉంచిన చంచల్‌గూడ జైల్లోనో, చర్లపల్లి జైల్లోనే ఉండేవారని అన్నారు. "డ్రోన్ ఎగరేస్తే రూ.500 జరిమానా విధిస్తారు. బీఆర్ఎస్ వాళ్లు అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఎంపీనని కూడా చూడకుండా నన్ను చర్లపల్లి జైల్లో పెట్టారు. కరడు గట్టిన నేరగాళ్లను బంధించినట్లు బంధించారు.**

**తొలి సమయం హైదరాబాద్, మార్చి 27:** తనది కక్ష సాధించే మనస్తత్వమే అయితే మొత్తం కేసీఆర్ కుటుంబం ప్రస్తుతం చర్లపల్లి జైల్లో ఉండేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గురువారం బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి కక్ష, పగ, ప్రతీకారాలకు పోతున్నారని బీఆర్ఎస్ నేత కేటీఆర్ చేసిన ఆరోపణలపై సీఎం తీవ్రంగా స్పందించారు. తాము నిజంగా కక్ష సాధింపునకు పాల్పడితే బీఆర్ఎస్ నాయకులు అసెంబ్లీలో కూర్చుని నోటికొచ్చినట్లు మాట్లాడేవారు కాదని వ్యాఖ్యానించారు. తనను ఉంచిన చంచల్‌గూడ జైల్లోనో, చర్లపల్లి జైల్లోనే ఉండేవారని అన్నారు. "డ్రోన్ ఎగరేస్తే రూ.500 జరిమానా విధిస్తారు. బీఆర్ఎస్ వాళ్లు అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఎంపీనని కూడా చూడకుండా నన్ను చర్లపల్లి జైల్లో పెట్టారు. కరడు గట్టిన నేరగాళ్లను బంధించినట్లు బంధించారు. 16 రోజులపాటు కంటికి మనిషి కనిపించకుండా నక్సల్స్‌ను ఉంచే డిటెన్షన్ సెల్లో ఉంచారు. ఆ కోపాన్ని కూడా బిగపట్టుకున్నా తప్ప కక్ష సాధింపునకు పాల్పడలేదు. జైల్లో రాత్రంతా లైట్లు ఆన్‌లో పెట్టి ఒక్క రాత్రి కూడా పడుకోకుండా చేశారు. దీపాల వెలుగుకు బల్లులు, పురుగులు వచ్చి చేరడంతో బలవంతంగా కళ్లు మూసుకున్నా నిద్ర వచ్చేది కాదు. దాంతో పగలు చెట్టు కింద పడుకుని నిద్రపోయే వాడిని. వాళ్ల తప్పులను దేవుడే చూస్తాడని, అంతకు అంత అనుభవిస్తారని భావించి ఊరుకున్నా. నా మీద కక్ష చూపిన వారిని దేవుడే ఆసుపత్రి పాలు చేశాడు" అన్నారు. 2015లో చంచల్‌గూడ జైల్లో ఉన్నప్పుడు తన బిడ్డ లగ్నపత్రిక రాసుకోవడానికి బెయిలు కోసం ప్రయత్నిస్తుంటే ఢిల్లీ నుంచి న్యాయవాదులను పిలిపించి వాదనలు చేసి అడ్డుకున్నారని గుర్తు చేశారు. రాజకీయ కక్ష సాధింపులంటే మీవి కదా అని కేటీఆర్‌ను ప్రశ్నించారు. ఇంత జరిగినా కక్ష సాధింపులకు పాల్పడకుండా విజ్ఞత ప్రదర్శించామని చెప్పారు. కేటీఆర్ సొంత పార్టీ ఆఫీసులో కొంత మందికి డబ్బులు ఇచ్చి తనను, తన కుటుంబ సభ్యులను బూతులు తిట్టించి, రికార్డు చేయించిన వారిని చెంప పగులగొట్టే శక్తి ఉన్నా సంయమనంతో వ్యవహరిస్తున్నానన్నారు. ఎవరివి కక్ష సాధింపు చర్యలో తెలంగాణ సమాజం గమనిస్తోందని వ్యాఖ్యానించారు. ఆ తర్వాత బడ్జెట్‌పై చర్చలో చివరగా ముఖ్యమంత్రి మాట్లాడినపుడు కూడా కేటీఆర్‌పై ఎదురుదాడికి దిగారు. ఇంగ్లిష్ అనేది భాషే తప్ప జ్ఞానం కాదన్నారు.

## అక్రమ వలసదారులకు ఇదేమీ
# ధర్మసత్రం కాదు

**చట్టబద్ధంగా వచ్చే వారికి స్వాగతం పలుకుతాం**
**దేశాభివృద్ధికి సహకరించే వారికి మద్దతు ఉంటుంది**
**ఇమ్మిగ్రేషన్ బిల్లుపై చర్చలో హోంమంత్రి అమిత్ షా**



**న్యూఢిల్లీ,మార్చి27:** అక్రమంగా దేశంలోకి ప్రవేశించే వారికి చోటు లేదని, ఇదేమీ ధర్మసత్రం కాదని కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా కఠినంగా హెచ్చరించారు. విద్యా, వ్యాపార పరంగా భారత్‌లోకి విదేశీయులను ఆహ్వానిస్తామని అన్నారు. కానీ, దురుద్దేశంతో దేశంలోకి ప్రవేశించే వారి పట్ల కఠిన వైఖరితో ఉంటామని హెచ్చరించారు. దేశాభివృద్ధికి సహకరించే వారికి మేము ఎల్లప్పుడు సహకరిస్తాం. కానీ, దురాలోచనతో దేశంలోకి ప్రవేశించి.. హాని కలిగించాలనుకునే వారి పట్ల మోదీ సర్కారు కఠిన వైఖరి అవలంబిస్తుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ వారిని దేశంలో అడుగు పెట్టనివ్వం. అలాంటి వారికి మా దేశం ధర్మశాల కాదని గుర్తు పెట్టుకోవాలని అమిత్ షా హెచ్చరించారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ఇమ్మిగ్రేషన్ బిల్లును లోక్‌సభ గురువారం ఆమోదించింది. చొరబాటు, అక్రమ వలసలను ఆపడం లక్ష్యంగా తీసుకువచ్చిన ఈ బిల్లు పేరు ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారిన్ బిల్లు 2025. ఈ సందర్భంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. దేశాభివృద్ధి కోసం వస్తున్న వలసదారులను మేము స్వాగతిస్తామని హోంమంత్రి లోక్‌సభలో వెల్లడించారు. విద్య, వ్యాపారం, పరిశోధన కోసం దేశానికి వచ్చే వారిని మేము స్వాగతిస్తాము. 2047 నాటికి దేశం అభివృద్ధి చెందిన దేశంగా మారాలనేది ప్రధాని మోడీ లక్ష్యం. అందుకే చాలా పాత చట్టాలను రద్దు చేశామన్నారు. వలస అనేది ఒక ప్రత్యేక సమస్య కాదు. దేశంలోని అనేక సమస్యలు దీనితో ముడిపడి ఉన్నాయి. జాతీయ భద్రత దృష్ట్యా, దేశ సరిహద్దులోకి ఎవరు ప్రవేశిస్తారో తెలుసుకోవడం చాలా ముఖ్యం. దేశ భద్రతకు హాని కలిగించే వారిపై తీవ్రంగా వ్యవహరిస్తామని అన్నారు. ఈ బిల్లు దేశ భద్రతను బలోపేతం చేస్తుందని, 2047 నాటికి భారతదేశం ప్రపంచంలోనే అత్యంత అభివృద్ధి చెందిన దేశంగా అవతరించేందుకు సహాయపడుతుందని కేంద్ర హోం మంత్రి అన్నారు. ఈ బిల్లు చట్టరూపం దాల్చిన తర్వాత, వలసలు, విదేశీ పౌరులకు సంబంధించిన నాలుగు పాత చట్టాలు కూడా రద్దు చేయబడతాయి. దీంతో అక్రమ చోరబాటు– దారులకు అడ్డుకట్టపడుతుంది. ఇమ్మిగ్రేషన్ అండ్ విదేశీ బిల్లు 2025 చట్టంగా మారిన తర్వాత ప్రభుత్వం 4 చట్టాలను రద్దు చేస్తుంది. వీటిలో విదేశీయుల చట్టం 1946, పాస్‌పోర్ట్ చట్టం 1920, విదేశీయుల నమోదు చట్టం 1939, వలస చట్టం 2000 ఉన్నాయి. ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ బిల్లు 2025 ప్రకారం.. ఎవరైనా నకిలీ పాస్‌పోర్ట్ లేదా వీసా ఉపయోగించి భారత్ లోకి ప్రవేశిస్తే లేదా దేశంలో ఉంటున్నట్లు– తేలితే ఏడు సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ. 10 లక్షల వరకు జరిమానా విధించనున్నారు. ఈ బిల్లు భారత్ సందర్శించే ప్రతి విదేశీయుడి గురించిన మొత్తం సమాచారాన్ని స్వీకరిస్తుందని షా తెలిపారు. అక్రమంగా మయన్మార్ నుంచి దేశంలోకి వచ్చే రోహింగ్యాలు, బంగ్లా దేశీయుల సంఖ్య పెరిగిపోయిందని.. వ్యక్తిగత ప్రయోజనాలతో లోనికి రానిస్తే అది భారత్‌కు సురక్షితం కాదని హితవు పలికారు.

# బంగ్లాకు జాతీయ దినోత్సవ శుభాకాంక్షలు

**తాత్కాలిక అధ్యక్షుడు యూనస్‌కు మోడీ లేఖ**



**న్యూఢిల్లీ,మార్చి27:** బంగ్లాదేశ్ 53వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత ప్రధాని మోడీ బంగ్లా తాత్కాలిక అధినేతకు లేఖ రాశారు. బంగ్లాదేశ్ 53వ జాతీయ దినోత్సవం జరుపుకున్న సందర్భంగా గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వాధినేత ముహమ్మద్ యూనస్‌కు లేఖ ద్వారా శు భాకాంక్షలు తెలిపారు. ప్రధానంగా 1971 బంగ్లాదేశ్ విముక్తి యుద్ధం అవిచ్ఛిన్న స్ఫూర్తిని భారతదేశం–బంగ్లాదేశ్ సంబంధాలకు పునాదిగా అభివర్ణించారు. ఆ దేశ స్థాపనలో భారతదేశం పాత్రను బంగ్లాదేశ్‌కు గుర్తు చేశారు. బంగ్లాదేశ్‌లో షేక్ ముజిబురాహ్మాన్ వారసత్వాన్ని తుడిచిపెట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్న సమయంలో లేఖలో విముక్తి యుద్ధం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. షేక్ హసీనా ప్రభుత్వాన్ని పడగొట్టి తాత్కాలిక ప్రభుత్వాధినేతగా యూనస్ మహమ్మద్ బంగ్లాదేశ్ లో అధికారం చేపట్టిన నాటి నుంచి ఆ దేశంలో హిందువులపై హింస చర్చనీయాంశంగా మారింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారిక నివేదికల ప్రకారం, ఆగస్టు 2024 నుంచి ఫిబ్రవరి 2025 మధ్య బంగ్లాదేశ్‌లో మైనారిటీ–లుగా ఉన్న హిందువులపై 2,374 కి పైగా హింసాత్మక దాడులు జరిగాయంటేనే పరిస్థితి తీవ్రత ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ కారణంగానే చిరకాల మిత్రులైన భారత్, బంగ్లాల మధ్య దూరం పెరుగుతూ వస్తోంది. ఇలాంటి సమయంలో స్నేహ హస్తం అందించేందుకు ఇండియా ఎల్లప్పుడూ సిద్ధమనే సంకేతం పంపిస్తూ లేఖ రాయడం విశేషం.

## వక్ఫ్ సవరణ బిల్లు ముస్లింల హక్కులకు భంగం

**తమిళనాడు అసెంబ్లీలో స్టాలిన్ తీర్మానం**

**చెన్నై,మార్చి27:** కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన వక్ఫ్ సవరణ బిల్లు 2024కు వ్యతిరేకంగా తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె స్టాలిన్ గురువారం రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా వక్ఫ్ సవరణ బిల్లు ముస్లిం హక్కుల్ని నాశనం చేస్తోంది స్టాలిన్ అన్నారు. ఈ బిల్లుపై గురువారం అసెంబ్లీలో మాట్లాడుతూ.. 'కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర హక్కులు, సంస్కృతి సంప్రదాయాలకు వ్యతిరేకంగా పథకాలను ప్రవేశపెడుతోంది. భారతదేశంలో వివిధ సంస్కృతులు, సంప్రదాయాలు, భాషలు ఉన్నాయి. కానీ వారు రాష్ట్రాలపై ప్రతీకారం తీర్చుకునే ఉద్దేశంతోనే వీటన్నింటినీ చేస్తున్నారు. ఇటీ–వల కేంద్రం తెచ్చిన వక్ఫ్ సవరణ బిల్లు ముస్లింలకు వ్యతిరేకంగా ఉంది. ఈ బిల్లు ముస్లిం హక్కుల్ని నాశనం చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం ముస్లింల సంక్షేమం గురించి గానీ, హక్కుల గురించి గానీ ఎప్పుడూ ఆలోచించలేదు. కాబట్టి కేంద్రం తెచ్చిన ఈ బిల్లుకి వ్యతిరేకంగా మేము తీర్మానం చేయాల్సిన స్థితిలో ఉన్నామని ఆయన అన్నారు.

## వచ్చే ఏడాది డిసెంబర్‌లోగా
# దేవాదుల పూర్తి

**దేవన్న పేట పంప్‌హౌజ్ ప్రారంభించిన మంత్రులు**

**తొలి సమయం వరంగల్,మార్చి27:** వచ్చే ఏడాది డిసెంబర్‌లోగా దేవాదుల ప్రాజెక్టు పనులన్నీ పూర్తి చేస్తామని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. దేవాదుల ప్రాజెక్టులో భాగంగా దేవన్నపేట వద్ద నిర్మించిన పంప్ హౌజ్‌ను మంత్రులు ఉత్తమ్, పొంగులేటి స్విచ్ ఆన్ చేసి గురువారం ప్రారంభించారు. అనంతరం ధర్మసాగర్ రిజర్వాయర్ వద్ద గోదావరి జలాలకు మంత్రులు ఇద్దరు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. వరంగల్ ప్రజలకు మాటిస్తున్నాం.. 2026 డిసెంబర్ లోగా దేవాదుల ప్రాజెక్ట్ మొత్తం పూర్తి చేస్తామని పేర్కొన్నారు. రెండున్నర దశాబ్దాలుగా దేవాదుల ప్రాజెక్టు నిర్మాణంలో ఉంది. ఇందులో మూడవ ఫేస్ దేవన్నపేట పంప్ హౌజ్‌ను ఇవాళ ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. 600 క్యూసెక్కుల నీటిని ఈ మోటార్ ద్వారా ఎత్తిపోస్తున్నామని తెలిపారు. 15 రోజుల్లో మరొక మోటార్‌ను అందుబాటు–లోకి తీసుకొస్తామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని పెండింగ్ ప్రాజెక్టులను తక్కువ ఖర్చుతో పూర్తిచేసి సాగు, తాగు నీరందిస్తామని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాలేకపోయినా ఇందిరమ్మ ప్రభుత్వం అందరి సంక్షేమ కోసం పని చేస్తోందని అన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో స్టార్ట్ అయిన దేవాదుల పనులు ఇప్పుడు అదే ప్రభుత్వంలో పూర్తి అవుతున్నాయన్నారు. దేవాదుల ప్రాజెక్ట్‌లోని దేవన్నపేట మోటారును ప్రారంభించామని.. దీని ద్వారా 600 నుంచి 650 క్యూసెక్కుల నీళ్లు ధర్మసాగర్‌కు చేరుతాయని తెలిపారు. తెలంగాణను సస్యశ్యామలంగా మార్చేందుకు ఇందిరమ్మ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఒక మోటార్ ఆన్ చేసి 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అక్కడి నుంచి గోదావరి జలాలు ధర్మసాగర్ రిజర్వాయర్‌లోకి చేరుకున్నాయి. అనంతరం అక్కడ ఇద్దరు మంత్రులు పూజలు నిర్వహించారు. 15 రోజుల్లో మరో మోటార్ ఆన్ చేస్తామన్నారు. గత ప్రభుత్వం దేవాదుల ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిందని, ఈ ఏడాది చివరికల్లా దేవాదుల ప్రాజెక్టు అన్ని దశల పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

# అకిట్స్‌లో ఘనంగా యాన్యువల్ డే సెలబ్రేషన్స్

- విద్యార్థుల నైపుణ్యం వెలికి తీసేందుకు టెక్నికల్ పేస్ట్ - ఘనంగా అకిట్స్ ప్రజ్ఞాన్ 2కె25
- స్కిట్లతో ఆకట్టుకున్న జబర్దస్త్ టీమ్ - అలరించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు





**తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/సుజాతనగర్ మార్చి 27**
విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు టెక్నికల్ పేస్ట్ ఎంత గానో దోహదపడతాయని చైర్మన్ దోసపాటి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని వేపలగడ్డ నందు గల అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాల నందు గురువారం నాడు ఆకిట్స్ ప్రజ్ఞాన్ టూ కే 25 రెండు రోజుల నేషనల్ లెవెల్ టెక్నికల్ పేస్ట్,వార్షికోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మొదటి రెండు రోజులు పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, షార్ట్ ఫిలిమ్స్, ప్రాజెక్ట్ ఎక్స్పో టెక్నికల్ క్విజ్ కార్యక్రమాల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు.ఆఖరి రోజు కార్యక్రమానికి కళాశాల చైర్మన్ దోసపాటి వెంకటేశ్వరావు ముఖ్య అతిధిగా హాజరై ప్రిన్సిపాల్ దయాకర్లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జబర్దస్త్ భాస్కర్, ఫైమా, నరేష్ లు చేసిన స్కిట్ లు విద్యార్థుల ను ఎంతగానో అకట్టకున్నాయి. స్కిట్ ల పట్ల విద్యార్థులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. మిమిక్రీ రమేష్ పాడిన సందేశాత్మక పాటలు, మిమిక్రి ప్రతి ఒక్కరిని ఆకట్టుకున్నాయి. విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ విభాగాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మాట్లాడుతూ తమ కళాశాల ద్వారా మరిన్ని కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమల ద్వారా విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీస్తామని వారికి రానున్న రోజుల్లో ఉద్యోగాలు కల్పించేందుకు ఎంతగానో కృషి చేస్తున్నామని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా మట్టిలో దాగున్న మాణిక్యాలు బయటకు వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, సైదయ్య, కన్వీనర్ శ్రీకాంత్,డీన్ అకాడమిక్స్ బాబురావు,లకపతి,కో కన్వీనర్ మునీర్, కృష్ణ మోహన్,ఐక్యూఏసీ కోఆర్డినేటర్ జెట్టి శ్రీనివాస్,హెచ్వోడీలు రవికిరణ్,వినోద్, సురేష్, అంబికా తదితరులు పాల్గొన్నారు



# ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

**తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం మార్చి 27**
యాసంగి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు.బుధవారం ఐ డి ఓ సి లోని సమావేశ మందిరంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ మరియు శాఖ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జ్లు, వ్యవసాయ, సహకార, డీఆర్డీఏ, తూనికలు కొలతలు, రవాణా, మార్కెటింగ్ శాఖ అధికారులు, రైస్ మిల్లర్లతో సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1,84,502 మెట్రిక్ టన్నుల కాగా అందులో సన్నరకం 99,729 మెట్రిక్ టన్నులు మరియు దొడ్డు రకం దాన్యం వస్తుందనే అంచనాతో 144 దాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అవసరాన్ని బట్టి అదనపు దాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతన్న పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పనకు ఏ, బి గ్రేడ్ రకాలుగా విభజించి మద్దుతు ధర ప్రకటించినట్లు చెప్పారు. ఏ గ్రేడ్ ధాన్యం 2320, బి గ్రేడ్ రకం 2300 రూపాయలుగా మద్దుతు ధర నిర్ణయించినట్లు చెప్పారు. ఈ సంవత్సరం ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నందున ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ,హమాలీలు వడ దెబ్బకు గురి కాకుండా టెంట్లు, షెడ్ నెట్‌లు, చలువ పందిళ్లు ఏర్పాటు చేసి నీడ ఉండేవిధంగా చూసుకోవాలన్నారు. తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రద్దీ నియంత్రణకు వ్యవసాయ అధికారులు క్రాప్ బుకింగ్ చేసిన ప్రకారం రైతులకు టోకెన్లు జారీ చేయాలని చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో చేయాల్సిన ఏర్పాటుపై చెక్ లిస్టు జారీ చేస్తామని, ఆ ప్రకారం ఏర్పాట్లు చేసి ధృవీకరణ నివేదికలు అందచేయాలని చెప్పారు. మన జిల్లాకు సమీప రాష్ట్రాల నుండి దాన్యం వచ్చే అవకాశం ఉన్నందున నియంత్రణకు సరిహద్దులో 8 చెక్ పోస్టులను ద్వారా పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రైతులు పండించిన ప్రతి దాన్యం గింజను కొనుగోలు చేయాలని చెప్పారు. కొనుగోలు చేసిన దాన్యాన్ని ఏ రోజు కారోజు ఆన్లైన్ చేసి రైస్ మిల్లులకు తరలించాలని దిగుమతిలో జాప్యం జరుగకుండా రైస్ మిల్లర్లు తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు. కొనుగోలు ప్రక్రియపై ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉండాలని చెప్పారు. దాన్యం విక్రయాలు నిర్వహణపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ అధికారులు, కొనుగోలు కేంద్రాల ఇన్చార్జిలు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని చెప్పారు.



నాణ్యతా ప్రమాణాలు పాటించడం వల్ల రైతులకు మంచి ధర లభిస్తుందని, వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించు విధంగా రైతులను సన్నద్ధం చేయాలని చెప్పారు. తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సెంటర్ ఇన్చార్జిపైనా, మిల్లర్లపైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి రైతు విక్రయాలు నిర్వహణకు వచ్చునపుడు ఆధార్, బ్యాంకు, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్సు వెంట తెచ్చుకోవాలని చెప్పారు.రైతు యొక్క ఆధార్ కార్డుకు లింక్ అయిన మొబైల్ నెంబర్ కు వచ్చే ఓటీపీ ఆధారంగా రైతు యొక్క రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందని,గన్నీ సంచులు కూడా సిద్ధంగా ఉంచాలని, ఆన్లైన్ చేసిన రైతులకు మాత్రమే గన్ని సంచులు ఇవ్వాలని చెప్పారు. గన్నీ సంచులు తీసుకున్న రైతుల వివరాలను రిజిష్టరులో నమోదులు చేయాలని చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలియన్లు, మాయిశ్చర్స్ సిద్ధంగా ఉంచాలని చెప్పారు. కొనుగోలు కేంద్రాల వద్ద బ్యానర్లలో రైతులకు తెలియజేసే విధంగా ఎం ఎస్ పి వివరాలు, నాణ్యత ప్రమాణాలు అధికారులను సంప్రదించవలసిన వివరాలు తెలియపరచాలి. సన్న వడ్ల కౌంటర్ మరియు దొడ్డు వడ్ల కౌంటర్ బ్యానర్లను ప్రదర్శించాలి. ధాన్యం విక్రయించే సమయంలో రైతులు మంత్ర ఐరిస్ స్కానర్ ద్వారా మాత్రమే కొనుగోలు పూర్తి అవుతుందని, డేటా ఎంట్రీ పూర్తి చేసేటప్పుడు రైతు కచ్చితంగా అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. తూకపు బాట్లు తనిఖీ చేసి సీల్స్ వేయాలని చెప్పారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతం చేయాలనిఅధికారులకు సూచించారు.సీఎంఆర్ 2024-25 ఖరీఫ్ సంబంధించి డెలివరీలను సకాలంలో చేయు విధంగా రైస్ మిల్స్ ను తనిఖీ చేసి నివేదికలు అందించవలసిందిగా పౌరసరఫరాల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ధాన్యం మద్దతు ధర, నాణ్యతా ప్రమాణాలకు సంబంధించిన గోడ పత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యచందన, డిఆర్డిఓ విద్యచందన , పౌర సరఫరాల సంస్థ మేనేజర్ త్రినాధ్, పౌర సరఫరాల అధికారి రుక్మిణి, డిసిఓ కుర్షిథ్ , వ్యవసాయ అధికారి బాబురావు , జిసిసి మేనేజర్ విజయకుమార్ తూనికలు కొలతల అధికారి మనోహర్, మార్కెటింగ్ అధికారి నరేందర్, రెస్ మిలర్ అసోసియేషన్ నుండి ఆనందరావు, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నాడు.

### రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు

# ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సహాయం

**తొలి సమయం రాయపర్తి మార్చి 27**
రాయపర్తి మండల కేంద్రంలో డబల్ బెడ్ రూమ్ కాలనీ లో ఎండీ అఖిల్ కు చేతికి గాయమై చికిత్స తీసుకోని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా వారిని ఇంటి వద్ద పరామర్శించి, ఆర్థిక సహాయం చేసిన..ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపటి శ్రీనివాస్ రెడ్డిఈ కార్యక్రమం లో ఫౌండేషన్ అధికార ప్రతినిధి లేతకుల రంగా రెడ్డి,మండల పార్టీ ప్రధాన కార్యదర్శి



పూస మధు, ఎస్టీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్ నాయక్ మండల పార్టీ అధికార ప్రతినిధి తాళ్లపెల్లి సంతోష్ గౌడ్‌లి, మండల పార్టీ నాయకులు ఎలామంచ శ్రీనివాస్ రెడ్డి, రాయపర్తి మాజీ ఎంపీటీసీ ఐత రామ్ చందర్, గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి చందు రామ్ పార్టీ ముఖ్య నాయకులు, ఫౌండేషన్ ప్రతినిధులు సంధి దేవేందర్ రెడ్డి, ఎండీ అక్బర్, చందు సతీష్ పాల్గొన్నారు.

## కొంపెల్లి వెంకన్న కుటుంబాన్ని ఓదార్పు

మాజీ మంత్రి డి ఎస్ రెడ్యానాయక్



**తొలి సమయం దంతాలపల్లి మార్చి 27**
దంతాలపల్లి మండలం కుమ్మరి కుంట్ల గ్రామంలో అనారోగ్యంతో ఇటీవల స్వర్గస్తులైన కొంపెల్లి వెంకన్న కుటుంబాన్ని మాజీ మంత్రి డోర్నకల్ మాజీ శాసన సభ్యుడు డి ఎస్ రెడ్డి నాయక్ పరామర్శించి వారి చిత్రపటానికి పూలమాలవేసి కుటుంబ సభ్యులకు మనోధైర్యం అందించారు. ఈ కార్యక్రమంలో వీరబోయిన కిషోర్, మద్దిరాల వీరస్వామి, పులుసు చంద్రమౌళి, దుబ్బాకుల వెంకన్న, రాచకొండ రామ్మూర్తి, మోహన్ రావు, కొంపెల్లి సోమయ్య, చామకూరి వెంకన్న, గంధసిరి రాములు, కొంపెల్లి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## కారోబర్ వెంకన్న కుటుంబానికి ఆర్థిక సాయం

కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు నాయక్



**తొలి సమయం దంతాలపల్లి మార్చి 27**
దంతాలపల్లి మండలం కుమ్మరికుంట్ల గ్రామంలో అనారోగ్యంతో ఇటీవల మరణించిన కారోబార్ కొంపెల్లి వెంకన్న కుటుంబ సభ్యుకు దంతాలపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏఎంసీ తోరూర్ వైస్ చైర్మన్ బట్టు నాయక్ ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి మనోధైర్యం కలిగించారు. ఈ కార్యక్రమంలో తండా రాములు, ఏరుకొండ యాకన్న, రమేష్, మురికి అనిల్, కారుపోతుల అనిల్, తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందు బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా కాంపల్లి ఉమామహేశ్వరరావు



**తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ఇల్లందు మార్చి 27**
తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు 2025- 26 సంవత్సరానికి గాను ఎన్నికలు హెూరాహెూరీగా జరిగినవి. ముఖ్యంగా ఇల్లందు బార్ అధ్యక్షుడు త్రీముఖ పోటీలో నెలకొంది.ఈ పోటీలో కాంపెల్లి ఉమామహేశ్వరరావు అధ్యక్షుడిగా ప్రధాన కార్యదర్శిగా కీర్తి కార్తిక్, ఉపాధ్యక్షుడిగా ఎస్.కె ఎండి కాసిం,సంయుక్త కార్యదర్శిగా సిహెచ్ నవీన్ కుమార్, కోశాధికారిగా మూడు వినోద్ గెలుపొందినారు. గెలుపొందిన అభ్యర్థులకు వారికి గెలుపుకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలుపుతూ కోర్టు ఆవరణలో మిఠాయిలు పంచుకొని సంబరాలు చేసుకున్నారు, ఈ సందర్భంగా వారు బార్ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.గెలుపొందిన అభ్యర్థులకు న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపినారు. ఎన్నికలు అధికారులుగా సీనియర్ న్యాయవాదులు ఎన్. చెన్నకేశవరావుకేశవరావు, దంతాల ఆనంద్ పాల్గొన్నారు

## జాతీయ ఉపాధి హామీ పథకం వ్యవసాయానికి అనుసంధానం చేయాలి

సిపిఐ న్యూ డెమోక్రసీ డిమాండ్

**తొలి సమయం తొర్రూరు మార్చి 27**
తొర్రూరు మండలంలోని చికటాయపాలెం గ్రామానికి సిపిఐ ఎమ్మెల్ న్యూ డెమోక్రసీ నాయకుడు ఊడుగుల లింగయ్య డివిజన్ ప్రధాన కార్యదర్శి జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని కోరారు ప్రతి చెరువులో కుంటలలో పనులు కల్పించాలని మరియు ఒక్కొక్క వ్యక్తికి కనీసం 200 రూపాయలు కొలతలు లేకుండా ఇవ్వాలని వారు కోరారు ప్రతి ఒక్క కుటుంబానికి 150 రోజులు పని దినాలు కల్పించాలని అన్నారు కొలతలు లేకుండా పనిచేయాలని మరియు పనులు జరిగే స్థలములో సైడ్ బాక్స్ మంచినీటి వసతి టెంటు సౌకర్యం కల్పించాలి. పనిచేసే వారికి పనిముట్లు అందజేయాలి అనికోరారు.



# త్రైత సిద్ధాంత విశ్వావసు నామ సంవత్సరం క్యాలెండర్

### ఆవిష్కరించిన ఎంపీడీవో ఎన్. విజయ్ కుమార్



**తొలి సమయం ఎల్కతుర్తి, మార్చి 27**

ఎల్కతుర్తి మండలంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో త్రైత సిద్ధాంత విశ్వావసు నామ సంవత్సరం త్రైత శకం 47వ సంవత్సరం తెలుగు యుగాది క్యాలెండర్లను గురువారం రోజున ఎంపీడీవో ఎన్ విజయ్ కుమార్ ప్రత్యేక అధికారి చేతుల మీదుగా తెలుగు క్యాలెండర్ ను ఆవిష్కరించారు. త్రైత సిద్ధాంత ప్రబోధా సేవ సమితి ఇందు జ్ఞాన వేదిక ఎల్కతుర్తి కమిటీ అధ్యక్షులు సదానిరంజన్ సిద్ధాంతి త్రైత సిద్ధాంత భగవద్గీత తెలుగు ఉగాది కాల సూచిక క్యాలెండర్ త్రైత శకం 47వను పంపిణీ చేశారు. అనంతరం అధ్యక్షులు సిద్ధాంతి మాట్లాడుతూ%ఎ%సనాతన ధర్మాన్ని వెలుగులోకి తీసుకురావడమే మా ఉద్దేశం ఆత్మజ్ఞానము తెలుగు పండుగల విశిష్టత తెలుగు నెలల విశిష్టత త్రైత సిద్ధాంత భగవద్గీత శ్లోకముల సారంతో పాటు ప్రతి సమస్యకు పరిష్కార మార్గాలు ఉన్న భగవద్గీత యొక్క సారాంశం ఇందులో పొందుపరచి స్వామి వారు రచించడం జరిగిందన్నారు. ఎంపీడీవో ఎన్. విజయ్ కుమార్ ప్రత్యేక అధికారి ఎంతో ఆసక్తిగా ఇలాంటి సాంప్రదాయాలు పూర్వీకుల కాలంలో ఉండేది ఈ కాల సూచికలో విషయాలను అడిగి తెలుసుకుని తెలుగు భాష కనుమరుగైపోతున్నటువంటి సమయములో స్వచ్ఛమైన త్రైత సిద్ధాంత భగవద్గీత మూడు మతాలకు అతీతంగా అందించిన శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల స్వామివారికి ప్రత్యేక కృతజ్ఞతలు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రబోధా సేవ సమితి ఎల్కతుర్తి కమిటీ అధ్యక్షుడు సదానిరంజన్ సిద్ధాంతి శ్రీరామోజు సతీష్ చారి, ఆఫీస్ సిబ్బంది సూపర్డెంట్ ఆఫీసర్ శ్రీనివాస్, సభాఆర్డినేట్ కుమారస్వామి, ఆంధ్రప్రభ రిపోర్టర్ జనగాని ప్రవీణ్, టీజీ 24 న్యూస్ రిపోర్టర్ నల్ల రాజిరెడ్డి, జంపాల సురేందర్, పాల్గొన్నారు.

# మా భూమిని కబ్జా కోరల నుండి కాపాడి మాకు న్యాయం చేయాలి..

### భూ బాధితుడు చిట్టి రెడ్డి రజినీకర్ రెడ్డి




**తొలి సమయం హన్మకొండ, మార్చి 27**

తాము 1984 లో కొనుగోలు చేసిన భూమిని అక్రమంగా కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారని కబ్జా కోరల నుండి తమ భూమిని కాపాడి తమకు న్యాయం చేయాలని భూ బాధితులు కోరారు. గురువారం హనుమకొండ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భూ బాధితుడు చిట్టి రెడ్డి రజనీకర్ రెడ్డి మాట్లాడుతూ తాము దుగ్గంపూడి జోజి రెడ్డి దగ్గర 30 మందిని కలిసి కుమార్ పెల్లి శివారులో సర్వేనెంబర్ 126, 117 ఎకరం మూడు గంటల భూమి కొనుగోలు చేశాము. 2017లో భూమి కాస్ట్ చేయించాము. కానీ 2017లో మాపై దాడి చేసి మమ్మల్ని చంపుతామని బెదిరించి మీ భూమి 117 కాదు 126 అని చెప్పి తమ భూమి ఎక్కడ ఉందో చూసుకోమని తమపై రంజిత్ రెడ్డి తో పాటు 20 మంది గుండాలు దాడి చేసి గాయపరిచారని వాపోయారు. ఆనాటి నుండి మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ అండదండలతో తమను ఇబ్బందులకు గురి చేస్తూ తీవ్ర మనోవేదనకు గురి చేస్తున్నారని అన్నారు. ఇది విషయం గతంలో కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామని అక్కడ, సిపి కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే అక్కడ ఎక్కడ కూడా భూమిక కాగితాలు తీసుకుని రాకుండా అధికారులను తప్పుదోవ పట్టిస్తూ తన తల్లి సోదరిని ముందు పెట్టి సెంటిమెంట్ వచ్చేలా చూసుకొని తమ భూమి లోకి తమను వెళ్లకుండా ఆపుతున్నారని తమ భూమి తమకు అప్పగించి న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో విజయ, శ్రీలత, కొండయ్య, అనంతలక్ష్మి, మహేందర్, ధనలక్ష్మి, తనీషా, సురేష్, గణేష్, మాధవరెడ్డి, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ సంక్షోభ సవాళ్లు !

**తొలి సమయం హైదరాబాద్,**

వ్యవసాయాభివృద్ధికి ఎంతచేసినా తక్కువే. ధాన్యం పండిస్తున్న రైతన్నలను కాపాడుకుంటేనే మనకు నోట్లోకి ముద్దపోతుంది. కార్పోరేట్ కంపెనీలను మించి వారికి రాయితీలు ఇవ్వడం కూడా మంచిదే. వ్యవసాయికంగా దేశాన్ని బలోపేతం చేస్తే..అనుబంధరంగాలను ప్రోత్సహిస్తే దేశంలో ఆకలిచావులు ఉండవు. ధాన్యానికి కొదవ ఉండదు. పండిన పంటలను తక్కువ ధరలకు ప్రజలకు అందించేలా కూడా కార్యాచరణ ఉండాలి. ఈ విషయంలో కేంద్ర రాష్ట్రాలు కలిసి వ్యవసాయాభివృద్ధికి, రైతుల సంక్షేమానికి బృహత్ ప్రణాళిక రచించాలి. వ్యవసాయానికి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉచిత విద్యుత్ ఇస్తున్నారు. సబ్సిడీలు అందిస్తున్నారు. ధాన్యం సజావుగానే కొంటున్నామని అంటున్నారు. పాలకులు, ప్రతిపక్ష నేతలు రైతుజపం చేస్తున్నా వారి జీవితాలు మాత్రం బాగుపడడం లేదు. నిరతంర ఉచిత విద్యుత్ ఇస్తున్న తెలంగాణ తరహాలో దేశవ్యాప్తంగా ఇస్తామని అప్పట్లో కెసిఆర్ ప్రకటించారు. అయితే ఇదొక్కటే సరిపోదు. నదుల అనుసంధానం ద్వారా ముందుగా నిరంతరంగా నీటి సరఫరా జరగాలి. ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచాలి. పండించిన పంటలను సక్రమంగా కొనుగోలు చేయాలి. పంటలు కొనుగోల చేయకుండా ఉచిత విద్యుత్,నీటితీరువా రద్దు, రైతుభరోసా వంటి కార్యక్రమాలు అమలు చేసినా లాభం లేదు. ఇకపోతే ఉచిత విద్యుత్ ఇస్తున్న కారణంగా...సరఫరాకు తగ్గట్లుగా ఉత్పత్తి కూడా ముఖ్యమే. దేశంలో సరిపడా విద్యుత్ ఉందా లేదా అన్న ఆలోచన చేయాలి. ఉత్పత్తి అవకాశాలు పెంచుకోవాలి. సోలార్ విద్యుత్కు ప్రాధాన్యం ఇవ్వాలి. అప్పుడే విద్యుత్ సమృద్ధిగా లభ్యత కాగలదు. అనేక గ్రామాలకు, ఇప్పటికీ విద్యుత్ సరఫరా లేదు. అలాంటప్పుడు పంపిణీతో పాటు, లభ్యత కూడా సవాల్ కానుంది. ముందుగా దేశంలో నిరంతర విద్యుత్ ఉత్పత్తి కోసం కృషి జరగాలి. ఉన్న విద్యుత్ను ఇప్పుడు సరఫరా చేయడానికే సరిపోదు. విద్యతు ఉత్పాదకత పెంచకుండా ఉచిత విద్యుత్ సాధ్యం కాదని కూడా పాలకులు తెలుసుకోవాలి. అయితే రైతుల ఆత్మహత్యలపై నివేదికలను పట్టించుకోవడం లేదు. అధికశాతం ప్రజల జీవనాధారమైన వ్యవసాయరంగం పట్ల, రైతుల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యతా రహితంగా వ్యవహరిస్తున్నాయన్న విమర్శలు ఉన్నాయి. విద్యుత్ నియంత్రణ బిల్లుకు నడుం బిగించిన కేంద్రం రాష్ట్రాలపై ఒత్తిడి తెస్తోందన్న విమర్శలు ఉన్నాయి. విద్యుత్ నియంత్రణ అంతా ఇక కేంద్రం చేతిలోకి వెళితే రాష్ట్రాలపై విద్యుత్ భారం తడిసి మోపెడు కానుంది. వ్యవసాయ రంగంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, అగ్రి బేస్డ్, ప్రాసెసింగ్ పై దృష్టి పెట్టామని, వంటనూనె గింజల ఉత్పత్తిపైనా ప్రధాని మోడీ గతంలో చేసిన ప్రకటన ఎలాంటి పురోగతి సాధించలేదు. ఎందుకంటే ఏడున్నరేళ్లుగా ఈ రంగంలో మార్పులు ఉంటే అన్నధాన్యాల ధరలు దిగి రావాలి. కానీ అలాంటి దేమీ లేదు. నిజానికి రైతులు ఉద్యమించడం వల్ల..మోడీ సాగుచట్టాలను ఉపసంహరించు కున్నారు. ఇప్పటికీ ధాన్యం కొనుగోళ్లు సాగక రైతులు ఆందోళనకు గురవుతున్నా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించు కోవడం లేదు. ఇంతకన్నా నిర్లక్ష్యం మరోటి ఉండదు. ఆరుగాలం కష్టించి పంటలు పండిస్తున్న రైతులు కాడి దించితే మనకు కడుపులో ముద్దకూడా దిగదని గుర్తించాలి. ఈ కార్పోరేట్ల ఉత్పత్తులు మన ఆకలి తీర్చవని తెలుసుకోవాలి. రైతులకు సంబంధించి తీసుకుంటున్న చర్యలు ఫలితం ఇవ్వడం లేదు. ఇలాంటి సందర్భంలో రైతులకు మేలు చేయాలనుకుంటే సాగుచట్టాలపై విస్తృతంగా దేశవ్యాప్తంగా కాకున్నా కనీసం పార్లమెంటులో చర్చ సాగేది. నిజానికి దేశంలో నూనెగింజల ఉత్పత్తి పెరిగితే నూనెధరల పెరుగుదల జరిగేది కాదు. అందుకే వ్యవసాయ రంగం పురోగమించ డానికి తీసుకుంటున్న చర్యలు మాత్రం గొప్పగా లేవనే చెప్పాలి. ప్రధానంగా దిగుబడులు తీవ్రంగా దెబ్బతీస్తున్నా వాటిని నిరోధించి, దేశీయంగా వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించడంలో కేంద్రం విఫలం అవుతోంది. వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులను తగ్గించి, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, గిట్టుబాటు ధరలు కల్పించడం వంటివన్నీ మాటలకే పరిమితం అయ్యాయి. దేశంలో వ్యవసాయరంగం అత్యంత సంక్షోభంలో కూరుకుని పోయి ఉన్న సమయంలో ఈ భారీ దిగుమతులు జరగడం గమనార్హం. చెప్పాలంటే, ఇంత భారీ మొత్తం దిగుమతుల కోసం ఖర్చు చేయకుండా, భారతీయ రైతారగంపై ఖర్చు చేసి ఉంటే పరిస్థితి ఎంతోకొంత మెరుగుపడి ఉండేది. అన్ని ప్రభుత్వాలూ రైతన్నను ఆదుకోవడం గురించీ, వ్యవసాయాభివృద్ధి గురించీ గొప్ప ఉపన్యాసాలు, హామీలు ఇవ్వడంతోనే సరిపెడు తున్నాయనే విషయం వాస్తవ పరిస్థితులను గమనించినప్పుడు అర్థం అవుతుంది. కేవలం ఒక్క సంవత్స రంలోనే దేశీయ వ్యవసాయానికి కేటాయించిన బడ్జెట్కన్నా మూడు రెట్లు ఎక్కువగా ఆహార ధాన్యాలను మనం దిగుమతి చేసుకున్నామంటే, మన నేతలు ఆ రంగం పట్ల ఎంత శ్రద్ధ పెడుతున్నారో అర్థమవుతుంది. హరిత విప్లవం నుంచి లబ్ధిపొంది, ఆహార ధాన్యాలలో స్వయం సమృద్ధిని సాధించిన దేశం ఇప్పుడు ఆ ఫలాలను నిర్లక్ష్యంగా జారవిడుచుకుంటూ, ఆహార ధాన్యాల దిగుమతిదారు అవుతోంది. పసుపు విప్లవాన్ని అది కావాలని ధ్వంసం చేసిన కారణంగా ఏర్పడిన ఫలితాల నుంచి మనం ఎలాంటి పాఠాలనూ నేర్చుకోలేదు. వంట నూనెల విషయంలో ఈ విప్లవం కారణంగా స్వయం సమృద్ధి సాధించిన మనం దశలవారీగా దిగుమతి సుంకాన్ని దాదాపుగా సున్నాకు దించిన నేపథ్యంలో మార్కెట్లోకి దిగుమతి ఉత్పత్తులు వెల్లువలా వచ్చిపడ్డాయి.

## మొదలైన న్యాయవాదుల నామినేషన్ పర్వం



**తొలి సమయం కరీంనగర్, మార్చి 27**

ఉమ్మడి కరీంనగర్ జిల్లా లో అతి పెద్దదైనా కరీంనగర్ బార్ అసోసియేషన్ 2025-2026 సంవత్సరానికి జరగనున్న ఎన్నిక లలో భాగంగా బుధవారం న్యాయవాదుల నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. కరీంనగర్ బార్ అసోసియేషన్ హాల్ లో ఎన్నికల అధికారి కాసుగంటి మాధవ రావు వివిధ పోస్ట్ లకు న్యాయవాదుల నుండి నామినేషన్ లను స్వీకరించారు. అందులో భాగంగా గురువారం వైస్ ప్రెసిడెంటు పదవి కి గాను కొత్త ప్రకాశ్ నామినేషన్ దాఖలు చేశారు. అతని వెంట సీనియర్ న్యాయవాదులు జి విలాస్ రావు, సుధగోని జనార్ధన్ గౌడ్ , తోటపెల్లి హరి ప్రసాద్ రావు, కొత్త నర్సింహా రెడ్డి, సుధీర్ కుమార్, కొత్తకొండ పర్శరామ్, ముని వేణుగోపాల్, శ్రీనివాస్ రావు, బి వేణు , కృష్ణ, పి శ్రీదర్, శ్రీకాంత్ , బి రమేశ్ తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం నామినేషన్ స్వీకరణ కు అఖరు రోజు అని ఎన్నికల అధికారి మాధవ రావు తెలిపారు.

## పిఠాపురం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

### అధికారులతో సమీక్షించిన పవన్

**అమరావతి,మార్చి27:** పిఠాపురం అభివృద్ధిపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫోకస్ పెట్టారు.ఇకపై వరుసగా సమీక్షలు నిర్వహించాలనే నిర్ణయానికి వచ్చారు.. పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించిన డిప్యూటీ- సీఎం పేషి అధికారులు, పిఠాపురం అర్బన్ డెవలప్మెంట్ అధికారులతో గురువారం నియోజవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు పవన్. అధికారులతో రివ్యూలో కీలక సూచలను చేశారు.. పిఠాపురం నియోజక వర్గ పరిధిలో నాలుగు పోలీస్ స్టేషన్లలో ఉన్న పరిస్థితిపై ఇంటెలిజెన్స్ నివేదిక తీసుకోవాలని ఆదేశించారు.. అవినీతికి పాల్పడుతున్న పోలీసు అధికారుల మూలంగా పోలీస్ శాఖ చులకన అవుతోందన్న ఆయన.. ప్రతివారం పిఠాపురం అభివృద్ధిపై సమీక్ష చేస్తానని తెలిపారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పురోగతిని పరిశీలించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్న ఆయన.. వేసవిలో నీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం ఉండ కూడదు.. సమ్మర్ స్టోరేజీ ట్యాంక్స్ దగ్గర తనిఖీలు చేయాలన్నారు. అమృత్ 2.0 ద్వారా పిఠాపురం పట్టణంలో తాగు నీటి సమస్యలు పరిష్కరించేందుకు ఇప్పటికే పురపాలక శాఖ అధికారులతో సమీక్ష చేశాను.. పిఠాపురం - ఉప్పాడ రైల్వే గేటు- వద్ద ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపగలిగాం.. రూ.59.7 కోట్లు- నిధులు మంజూరయ్యాయని వెల్లడించారు.. ఇక, ఉపాధి హామీ పథకంలో రూ.40.2 కోట్లతో 444 రోడ్డు పనులు చేపట్టాం.. 431 గోకులాలు పిఠాపురం నియోజకవర్గానికి ఇచ్చాం.. పిఠాపురంలో ప్రభుత్వ ఆసుపత్రిని సీహెచ్సీ నుంచి ఏరియా ఆసుపత్రి స్థాయికి పెంచాం.. అందుకు అనుగుణంగా రూ.38.32 కోట్లు- నిధులు వచ్చాయని సమీక్ష సమావేశంలో డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ వెల్లడించారు ..

## ఢిల్లీ లిక్కర్ కన్నా ఎపి లిక్కర్ అతిపెద్దది

### ఎక్సైజ్ జ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర కీలక వ్యాఖ్యలు

**అమరావతి,మార్చి27:** లిక్కర్ స్కాంపై ఎక్సైజ్ జ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర కీలక వ్యాఖ్యలు చేశారు.. ఏపీలో వైసీపీ హయాంలో ఐదేళ్లపాటు లిక్కర్ స్కామ్ జరిగిందన్న ఆయన.. ఇది జగమెరిగిన సత్యం.. ఢిల్లీ లిక్కర్ స్కామ్.. ఏపీ లిక్కర్ స్కామ్ ముందు పీనట్స్ అంత ఉందని పేర్కొన్నారు.. లిక్కర్ స్కామ్ అతి పెద్ద స్కామ్ అని మొదటినుంచి మేం చెబుతున్నాం.. వైసీపీ నుంచి బయటకు వచ్చి మా పార్టీ నుంచి గెలిచిన ఎంపీ లావు పార్లమెంట్ లో చెప్పారు.. ఇదే విషయంపై కేంద్ర హోంమంత్రికి వినతి పత్రం కూడా ఇచ్చారని తెలిపారు.. విజయసాయి రెడ్డి కూడా కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి లిక్కర్ స్కామ్ లో వైఎస్ జగన్ ఏజెంట్ గా ఉన్నాడని చెప్పారన్న ఆయన.. వాళ్ల నాయకులే ఇదంతా చెబుతున్నారు.. లిక్కర్ లో ప్రతి దశలో స్కామ్ జరిగిందని ఆరోపించారు..రాష్ట్రం ఈ స్కామ్ వల్ల వేల కోట్ల ఆదాయం కోల్పోయిందన్నారు మంత్రి కొల్లు.. దీనివల్ల పక్క రాష్ట్రాలు బాగుపడ్డాయన్న ఆయన.. 99 వేల కోట్లు- నగదు లావాదేవీలు జరిగాయి.. లిక్కర్ స్కామ్ పై సీఐడీ, సిట్ విచారణ జరుగుతోందన్నారు.. మరోవైపు, బియ్యం కేసు ఇంకా విచారణ దశలో ఉందని పేర్ని నాని గుర్తు పెట్టు-కోవాలని సూచించారు..

## టెన్త్ పేపర్ లీకేజీలో ఇద్దరు అధికారుల సస్పెన్షన్

**కామారెడ్డి,మార్చి27:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు జరుగుతున్నాయి. మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల సందర్భంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పరీక్షా పత్రం లీకేజీ ఘటనలు చోటు-చేసుకుంటున్నాయి. అధికారులు చర్యలు తీసుకుంటున్నా.. లీకేజీలు మాత్రం ఆగడం లేదు. తాజాగా బుధవారం కూడా కామారెడ్డిలో లీకేజీ ఘటన చోటు-చేసుకుంది. జుక్కల్ జిల్లా పరిషత్ పాఠశాలలో సిబ్బంది పరీక్షా పత్రంలోని కొన్ని ప్రశ్నలను లీక్ చేశారు. బుధవారం కామారెడ్డి జిల్లాలోని జుక్కల్ జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి పరీక్షా పత్రం లీకేజీ అయింది. పరీక్షకు కొన్ని నిమిషాల ముందు సిబ్బంది కొందరు ప్రశ్నలను కాగితంపై రాసి బయటకు పంపారు. ఆ ప్రశ్నలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101